క్లుప్తంగా

పశుగ్రాసం ధర భగభగ


ట్రాక్టర్‌పై పశుగ్రాసాన్ని తరలిస్తున్న రైతులు

అశ్వారావుపేటరూరల్: మూగజీవాలకు అందించే పశుగ్రాసం ధరధర భగభగమండుతోంది. గతేడాది కంటే ధర పెరిగిపోవడంతో కొనుగోలు చేయలేక సతమతం అవ్వాల్సి వస్తోంది. అశ్వారావుపేట మండలంలో ట్రాక్టర్ ఎండు గడ్డి ధర రూ.5వేలు ఉండగా, ప్రస్తుతం ట్రాక్టర్ గడ్డి ధర రూ.6,500 నుంచి రూ.7వేల దాకా పలుకుతోంది. దీంతో మూగజీవాల పెంపకం దారులపై భారం పడుతోంది. ధర పెరుగుదలకు యంత్రాలతో వరి కోతలు చేయడమే కారణమని, కూలీలతో వరి కోతలు చేస్తే ధర అందుబాటులో ఉంటుందని పెంపకందారులు చెబుతున్నారు.

రేగా వ్యాఖ్యలు హాస్యాస్పదం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గుండాల: ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుపై శనివారం గుండాల పర్యటనకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని మండల ఏఎంసీ డైరెక్టర్ ఊకే బుచ్చయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాయం వెంకటేశ్వర్లు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అమలు చేయించిన పనులను తమరు చేయించినట్లుగా మాట్లాడుతున్నారని, శిలా ఫలకాల మీద పేర్ల కోసం, ఫోటో ఫోజుల కోసం, కాంట్రాక్టర్ల నుంచి కమిషన్ల కోసం అలా చేశారని రేగాను విమర్శించారు. త్వరలో స్థానిక ఎన్నికల ప్రకటన రావడంతో ప్రెస్ మీట్ పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో అన్ని డిపార్ట్‌మెంట్ల వారు తమ డిమాండ్ల కోసం రోడ్లు ఎక్కితే వారిని అక్రమ అరెస్టులు చేశారని గుర్తుచేశారు. సమావేశంలో పాయం గణేష్, ఖాసీం, వాజీద్, పల్లపు రాజేష్, బొంగు చంద్రశేఖర్, బొర్ర వెంకటేశ్వర్లు, నూనావత్ రవి, బొర్రయ్య, రంగయ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ మంజు భార్గవి

గుండాల: మారుమూల ప్రాంతాల యువత, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి అన్నారు. ఆదివారం ఆళ్లపల్లి మండలం మర్కోడులో యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని స్నేహ స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. పల్లెల్లో క్రీడా మైదానాలు లేకపోవడంతో వివిధ క్రీడల్లో ప్రతిభ ఉన్న యువతకు, విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి తగ్గుతోందని అన్నారు. గత ప్రభుత్వం కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడామైదానాలను వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ యువత అన్ని క్రీడల్లో రాణిస్తూ జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. పూకే కిషోర్ బాబు తాళ్లపల్లి శేఖర్ సుతారి కృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన కోసూరి రాములు(50) శనివారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. రాములు మృతదేహానికి ఆదివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

మంత్రి ఆశీర్వాదం

దమ్మపేట: నూతనంగా వివాహం జరిగిన వధూవరులను వారి నివాసంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆదివారం ఆశీర్వదించారు. మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన బచ్చు శ్రీనివాసరావు కుమారుడు మురళీకృష్ణకు వివాహం జరుగగా.. ఆ నూతన దంపతులను వారి నివాసంలో మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి దీవెనలు అందించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, చల్లగుళ్ల నరసింహారావు, గాదె చెన్నారావు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బాల్యం.. బలహీనం


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి బరువు చూస్తున్న సిబ్బంది

- పిల్లల్లో పోషకాహార లోపం..
- వయసుకు తగ్గట్టుగా లేని బరువు, ఎత్తు
- వెంటాడుతున్న అనారోగ్యం

భద్రాచలంఅర్బన్: పౌష్టికాహార లోపం బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సంబంధిత అధికారులు చెబుతున్నప్పటికీ.. పిల్లలు తరుచూ అనారోగ్యం బారిన పడటం కనిపిస్తూనే ఉంది. వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు ఉండడం లేదు. గర్భస్థ సమయంలో తల్లులు అనారోగ్యానికి గురికావడం, తక్కువ వయస్సులో వివాహాలు చేయడం, మహిళల్లో రక్తహీనత కారణాల వల్ల పుట్టే పిల్లల్లో బలహీనతలు రావడం, పిల్లలు ఎదుగుతుండగా సరైన పౌష్టికాహారం అందకపోవడం ఇందుకు ప్రధాన కారణాలు. ఈ నేపథ్యంలోనే దుమ్ముగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వందల మంది పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు.

ఇదీ లెక్క..

దుమ్ముగూడెం ఐసీడీఎస్ పరిధిలో భద్రాచలం, దుమ్ముగూడెం సెక్టార్లు ఉండగా.. వీటి పరిధిలో మొత్తం 173 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో నవజాత శిశువు నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలు 5297 మంది ఉన్నారు. అయితే వయస్సుకు తగిన బరువు లేని పిల్లలు 92 మంది ఉన్నారు. వయస్సుకు తగిన ఎత్తు లేని పిల్లలు 328 మంది ఉంటే.. ఎత్తుకు తగిన బరువు లేని వారు 225 మందిగా తేలారు. అతితీవ్ర లోప పోషణ ఉన్న పిల్లలు 42 మంది ఉన్నారు. వీరంతా పోషకాహారలోపంతో ఉన్నట్లు స్పష్టం అవుతోంది.

ప్రత్యేక పౌష్టికాహారం..

ఆరు నెలల్లోపు పిల్లలు బరువు తక్కువగా ఉన్నా.. పౌష్టికాహారం లోపం ఉన్నా తల్లి పాలు ఆరు నెలలు పాటు తాగించాలని అంగన్‌వాడీ కార్యకర్త ఇళ్లకు వెళ్లి తల్లులకు చెబుతారు. ఆరు నెలలు దాటిన పిల్లలైతే తల్లి పాలతో పాటు బాలామృతం, 100 ఎంఎల్ పాలు, గుడ్లు ఇస్తారు. మూడేళ్లు దాటిన పిల్లల బరువు తక్కువగా ఉన్నట్టయితే మధ్యాహ్న భోజనంతో పాటు 200 ఎంఎల్ పాలు, ప్రతీ రోజు గుడ్డు ఇస్తారు.

24 నెలల వరకు ఉండాల్సిన పిల్లల బరువు, ఎత్తు..

వయసు (నెలలు)	బరువు (కిలోలు)	ఎత్తు (సెం.మీ)
0	3.3	49.9
3	6.4	61.4
6	7.9	67.6
9	8.9	72.0
12	9.6	75.7
15	10.3	79.1
18	10.9	82.3
21	11.5	85.1
24	12.2	87.8

పరిశీలన ఇలా..

అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన చిన్నారుల ప్రగతిని నెలకోసారి పరిశీలిస్తారు. గతంతో పోలిస్తే కేంద్రాల్లో చేపడుతున్న కార్యక్రమాలు, అందిస్తున్న ప్రత్యేక పోషకాహారం కారణంగా లోపం ఉన్న విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాని వాస్తవంగా ఆ పరిస్థితి లేదు. గర్భం దాల్చిన మూడు నెలల నుంచి గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వైద్యులు సూచించిన విధంగా మహిళలు గర్భవతి అయిన సమయంలో తీసుకోవాల్సిన పౌష్టికాహారాన్ని తీసుకోకపోవడంతో శిశువులకు ఆరు నెలల పాటు తల్లి పాలు సరైన మోతాదులో లభించడం లేదు. పౌష్టికాహార లోపం నివారణకు ఐసీడీఎస్ అధికారులు, వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు.

అవగాహన కల్పిస్తున్నాం..



తరచూ పిల్లల బరువు, ఎత్తు కొలతలు తీస్తున్నాం. బాగా సమస్య ఉండే పిల్లలకు బలవర్ధకమైన ఆహారం అందేలా చూస్తాం. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నాం. ఆహారం క్రమపద్ధతిలో తీసుకునేలా చైతన్యపరుస్తున్నాం. పిల్లల్లో పోషకాహార లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– జ్యోతి, ఐసీడీఎస్ దుమ్ముగూడెం ప్రాజెక్టు అధికారి

తల్లి పాలే శ్రీరామ రక్ష..



గర్భం దాల్చిన నాటి నుంచే తల్లి కడుపులో బిడ్డ ఎదుగుదలను క్రమం తప్పకుండా పరిశీలించాలి. గర్భిణులు అంగవాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహారం తీసుకోవాలి. అప్పుడే పుట్టిన పిల్లలకు ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వాలి. ఏడాది తర్వాత పోషకాలు, విటమిన్లు ఉండే ఆహారం పెట్టాలి. చిన్నారులకు ఉదయం సూర్య రశ్మి తగిలేలా జాగ్రత్తలు తీసుకోవాలి. దీంతో డి విటమిన్ లభించి వారి ఎముకలు బలంగా తయారవుతాయి. పోషకాహారంతో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది.

– డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, పిల్లల వైద్య నిపుణుడు, భద్రాచలం

ఇది క్రీడా ప్రాంగణమా?



మిర్చి పంటల సమీపంలో క్రీడా ప్రాంగణం

కరకగూడెం: గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాలను వెలికితీయడం కోసం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు కొన్నిచోట్ల సరిగా వినియోగంలో లేకుండా పోతున్నాయి. ముఖ్యంగా వాటి నిర్వహణ లేకపోవడం, దూర ప్రాంతాల్లో స్థాపన చేయడంతో అనేక సమస్యలు వచ్చిపడుతున్నాయి. ఈ పరిస్థితితే కరకగూడెం మండల పరిధిలోని తుమ్మలగూడెం గ్రామ పంచాయతీలోని రేగుళ్ల గ్రామంలో ఉంది. ఇక్కడి క్రీడా ప్రాంగణం చుట్టూ మిర్చి పంటలే ఉన్నాయి. అక్కడే మిర్చిని ఎండబోస్తుంటారు. అలాంటి చోట క్రీడాప్రాంగణం ఉండడంతో అక్కడికి వెళ్లి ఆటలు ఆడేందుకు ఎవరూ మక్కువగా చూపడం లేదు. కొందుకు వెళ్లేందుకు సాహసం చేద్దామనుకున్నా క్రీడాప్రాంగణ నిర్వహన నిరుత్సాహపరుస్తోంది. ప్రాంగణంలో పిచ్చి చెట్లు మొలిచి ఆటలు ఆడుకోవడానికి వీలు లేకుండా తయారైంది. అధికారుల అలసత్వానికి ఇది నిదర్శనమంటే పలువురు పెదవివిరుస్తున్నారు.

పాఠశాల వార్షికోత్సవం



వేడుకలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

అశ్వారావుపేటరూరల్: ప్రైవేటు పాఠశాలల బాధ్యులు విద్యను వ్యాపార దృష్టితో చూడొద్దని, సేవభావంతో తక్కువ ఫీజులతో విద్యనందించాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు. పట్టణంలోని జవహర్ విద్యాలయం 40వ వార్షికోత్సవ వేడుకలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను ప్రభుత్వ పాఠశాలల్లో తొమ్మిదేళ్లు పీఈటీగా పని చేసి, పేద విద్యార్థులను క్రీడారంగంలో ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. పట్టణంలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో జవహర్ విద్యాలయం యాజమాన్యం తల్లిదండ్రుల దగ్గర తక్కువ ఫీజులు వసూలు చేసి నాణ్యమైన విద్యను అందించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా జ్ఞాపికలు, బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులు ఆట, పాటలు, సాంస్కృతి నృత్యాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.ప్రసాద్‌రావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం హరితి, జవహర్ పాఠశాల హెచ్‌ఎం మైథిలి, కరస్పాండెంట్ భారతి, ప్రవీణ్, సొసైటీ కార్యదర్శి జూపల్లి బ్రహ్మారావు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత యూఎస్ ప్రకాశ్‌రావు, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి రమేష్, సుంకవల్లి వీరభద్రరావు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న 2003 బ్యాచ్ విద్యార్థులు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన 1992–1993, 2002–2003 బ్యాచ్‌ల విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. దుమ్ముగూడెం గ్రామంలో జరుగుతున్న ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా అనాటి మధురస్మృతులను గుర్తు చేసుకుని ప్రస్తుత జీవిత విశేషాలను ఒకరికొకరు పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో 1993 బ్యాచ్ విద్యార్థులు బత్తుల శోభన్‌బాబు, శిరసాని దుర్గారావు, మాదిరెడ్డి శ్రీను, రవి, సీత, నాగమణి, సుజాత, శ్రీ లక్ష్మి, నాగజ్యోతి, శ్రీను, మండా గోపి, నూర్జహాన్, 2003 బ్యాచ్ విద్యార్థులు బేరి విరేందర్‌రెడ్డి, అంజర్‌బేగ్, రామారావు, అనిల్‌కుమార్, రాజశేఖర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరుమల్ల జాతరకు తరలిరండి

కరకగూడెం: ఈ నెల 11 నుంచి వైభవంగా జరిగే చిరుమల్ల జాతరకు భక్తులు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఆనాటి పూర్వం సమ్మక్క చిరుమల్ల గ్రామంలోనే పుట్టిందని, ఆమె ఇక్కడ నుంచి బయ్యక్కపేట అక్కడ నుంచి మేడారం వెళ్లి స్థిరపడిందని తెలిపారు. అలాంటి మహత్తరమైన జాతరను అత్యంత పవిత్రంగా ఈ చిరుమల్ల జాతరలో జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా ఈ జాతర ఒక సంవత్సరం మేడారంలోను మరొక సంవత్సరం చిరుమల్లలో అంగరంగ వైభవంగా సమ్మక్క సారలమ్మ జాతరను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ జాతర చిరుమలలో రెండేళ్లకోసార్ జరుగుతుందని, అధిక సంఖ్యలో భక్తులు, పూజారులు, తలపతులు, ఆదివాసీ సంఘాలు ఈ జాతరను తిలకించి విజయవంతం చేయాలని కోరారు.

ముత్యాలమ్మ ఆలయంలో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం వద్ద ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించగా, ఆలయం వద్ద సందడి ఏర్పడింది.

20న ‘చలో హైదరాబాద్’

గుండాల: అధికారంలోకి రాగానే వంద రోజుల్లో అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, 420 హామీలు ప్రకటించిందని, ఇప్పుడు అధికారంలోకి వచ్చి 14 మాసాలైనా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని న్యూడెమోక్రసీ గుండాల మండల కార్యదర్శి అరెం నరేష్, జిల్లా నాయకుడు కొమరం సీతారాములు అన్నారు. పోతిరెడ్డిగూడెం, చీమల గూడెం, కన్నాయిగూడెం, నరసాపురం తండా తదితర గ్రామాల్లో ఆదివారం జరిగిన గ్రూప్ మీటింగ్‌లలో వారు మాట్లాడుతూ.. రైతు భరోసా రూ.15వేలు ఎకరాకు, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద రూ.2,500, వృద్ధాప్య పింఛన్ రూ.4 వేలు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు లాంటి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఈ హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. హామీల అమలు కోసం న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు పెండేకట్ల పెంటన్న, వాగబోయిన బుచ్చయ్య, పాయం ఎల్లన్న, కల్తీ ప్రమోద్, బోడ వీరు, బోడ రాము, దుగ్గి శేఖర్, చింత కోటేష్, కిసాన్ సుధాకర్, మోకాళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తా


దుర్గమ్మ గుట్టపై స్థానికులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: మండల పరిధిలోని గుర్వాయిగూడెం గ్రామ శివారులో దుర్గమ్మ గుట్టపై కాకతీయుల కాలంలో నిర్మితమైన చారిత్రాత్మక, పురాతనమైన శంకరగిరి దుర్గేశ్వర స్వామి ఆలయాన్ని, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఆదివారం గుర్వాయిగూడెం శివారులోని దుర్గమ్మ గుట్టపైకి ఎమ్మెల్యే జారే, స్థానికులతో కలిసి కాలినడకన వెళ్లారు. ఈ సందర్భంగా గుట్టపైన వెంచేసియున్న దుర్గమ్మ, శివయ్యలను దర్శించుకుని, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గుట్టపై దాదాపుగా 30 ఎకరాల విస్తీర్ణం చుట్టూ నిర్మించి ఉన్న రాతి గోడను, కాకతీయ రాజుల కాలంలో గుట్టపై ఉన్న లోతైన బావిని పరిశీలించారు. స్థానికుల ద్వారా ఆలయ చరిత్ర, విశిష్టతను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అడవిలో గుట్టపై ఉన్న ఈ ఆలయ ప్రాంతం.. పర్యాటక ప్రదేశానికి చాలా అనువైనదని అన్నారు. ఘన చరిత్ర ఉన్న ఈ ఆలయ పునర్వైభవం, అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. ఎకో టూరిజంలో భాగంగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి, ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ మేరకు త్వరలో జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులను కలుస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు ముళ్లపూడి వెంకటేశ్వరరావు, పాశం ప్రసాద్, గుర్రం మల్లేష్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్‌తో విద్యాభివృద్ధికి చేయూత


మాట్లాడుతున్న కాకతీయ విద్య ఫౌండేషన్ నాయకుడు సత్యనారాయణ

మణుగూరురూరల్: కమ్మ సామాజికవర్గ పిల్లల విద్యాభివృద్ధికి కాకతీయ విద్యా ట్రస్ట్ ద్వారా చేయూతగా నిలవనున్నట్లు కాకతీయ విద్యా ఫౌండేషన్ బాధ్యులు గూడూరు సత్యనారాయణ తెలిపారు. ఆదివారం మణుగూరు వచ్చిన ఆయనకు స్థానిక కమ్మ సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాకతీయ విద్యా ట్రస్ట్ ద్వారా ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లోని కమ్మ పేద విద్యార్థులకు ఉచిత విద్య, హాస్టల్ వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఎవరైనా తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ఈ అవకాశం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కమ్మ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు దండా రాధాకృష్ణ, వీరమనేని చెన్నకేశవులు, అధ్యక్షుడు ఉప్పలపాటి వెంకట రాంబాబు, గౌరవ సలహాదారులు పుచ్చకాయల శంకర్, తోటకూరి సతీష్‌కుమార్, ఈరెల్లి అచ్చయ్య, ఉడతానేని రవి, ధారవనేని హరికృష్ణ, ముప్పారపు నరసింహారావు, ఉడతానేని శ్రీను, మల్లంపాటి వెంకటేశ్వర్లు, పునులూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

‘పథకాల అమలులో విఫలం’

మణుగూరుటౌన్: పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య అన్నారు. ఆదివారం పగిడేరులో కుంజా కృష్ణకుమారి ప్రథమ వర్ధంతి సభ మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు అధ్యక్షతన జరగగా.. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ లౌకిక రాజ్యాంగాన్ని నివారించేందుకు కుట్రపన్నుతోందన్నారు. బీజేపీని పాతరేయడమే కుంజాకుమారికి నిజమైన నివాళి అన్నారు. కేంద్రం బడ్జెట్‌లో ఉపాధిహామీ కూలీలకు 85లక్షల కోట్లు మాత్రమే కేటాయించి అన్యాయం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు భూములు లేని ప్రతి పేద కుటుంబానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన అనంతరం మహిళలపై దాడులు పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు దామల్ల వెంకన్న, మడి నర్సింహారావు, పిట్టల నాగమణి, బొల్లం రాజు, మండల కమిటీ సభ్యులు కుంజా రాజు, పల్లపు నాగేశ్వరరావు, పసునూరు సంజీవరెడ్డి, ములకల ఉత్తం, కొండ్రు గౌరి, హమాలి కార్యదర్శి శ్రీను తదితరులు ఉన్నారు.

16న టీఐసీయూ మహాసభ


మాట్లాడుతున్న టీఐసీయూ నాయకులు

మణుగూరురూరల్: ఈ నెల 16వ తేదీన కొత్తగూడెంలో జరిగే ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా మహాసభను జయప్రదం చేయాలని టీఐసీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూధన్‌రెడ్డి, ఏరియా కార్యదర్శి బి.మల్హార్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టీఐసీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. పోరాటాలు, రక్తతర్పణాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను, చట్టాలను కాలరాసేందుకు చూస్తోందన్నారు. కార్మికుల శ్రమను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లపై సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. 16న జరిగే టీఐసీయూ జిల్లా మహాసభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో నాయకులు జెల్లా అశోక్, బత్తుల వెంకటేశ్వర్లు, మిట్టపల్లి రాజేందర్, వి.జానయ్య, ఆర్.బిక్షం, జె.యాకయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయం

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న ముత్యాలమ్మ అమ్మవారి 23వ జాతరలో భాగంగా ఆదివారం ఆలయం భక్తులతో కిటకిటాలాడింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో గ్రామం అంతా జనాలతో నిండిపోయింది. సుమారు 10 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు తెలిసింది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. దాతల సహకారంతో ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేశారు. పోలీసులు పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు.



అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా అప్రోచ్ రోడ్డు



మండలంలోని నల్లకుంట గ్రామ శివారు వద్ద వ్యవసాయ భూముల సమీపంలోని అప్రోచ్ రోడ్డు పూర్తిగా ధ్వంసం కాగా, చాలా ప్రమాదకరంగా మారింది. ఈ అప్రోచ్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోగా.. పక్కనే నీటి కుంట కూడా ఉంది. పైగా సమీపంలో మూలమలుపు ఉంది. దీంతో ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులకు డ్యామేజ్ అయిన అప్రోచ్ రోడ్డు సరిగా కనిపించక, తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి, అప్రోచ్ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– దమ్మపేట